సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం । 12 । జూలై । 2023



చీనీ టన్ను రూ.20 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి. మార్కెట్‌కు 696 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



తుంగభద్రకు పెరిగిన వరద
ఎగువన కురుస్తున్న వర్షాలతో తుంగభద్ర జలాశయానికి వరద భారీగా చేరుతోంది. మంగళవారం 17.761 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది.

గరిష్టం/కనిష్టం
34.4°/21.9°

జిల్లాలో మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం తగ్గింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. నైరుతి దిశగా గాలులు గంటకు 8 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

‘జగనన్న సురక్ష’తో సేవలు వేగవంతం
- కలెక్టర్ అరుణ్‌బాబు



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

గాండ్లపెంట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన ‘జగనన్న సురక్ష’ కార్యక్రమం ద్వారా పౌరసేవలన్నీ వేగవంతంగా అందుతాయని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని సోమయాజులపల్లి గ్రామ సచివాలయ పరిధిలో నిర్వహించిన ‘జగనన్న సురక్ష’ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. తొలుత సచివాలయాన్ని పరిశీలించి సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఏ సర్టిఫికెట్ కావాలన్నా ‘జగనన్న సురక్ష’ కార్యక్రమంలో ఉచితంగా అందజేస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వలంటీర్‌కు సమస్య చెబితే వెంటనే పరిష్కరిస్తామన్నారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కదిరి ఆర్డీఓ రాఘవేంద్ర, డీఎల్‌డీఓ సూర్యనారాయణ, మండల ప్రత్యేకాధికారి మోహన్‌రామ్, తహసీల్దార్ హమీద్‌బాషా, ఎంపీడీఓ యాదవేంద్ర, ఈఓఆర్డీ సునీత, కార్యదర్శి శంకర్, ఎంపీపీ తాతం జగన్మోహన్, కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు భాస్కరరెడ్డి, గృహసారథులు సిద్దారెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

గుప్త నిధుల వేటగాళ్ల అరెస్టు



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

తనకల్లు: మండల పరిధిలోని డీ. చెక్కవారిపల్లి సమీపంలో నలుగురు గుప్త నిధుల వేటగాళ్లను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ రాంభూపాల్ తెలిపిన వివరాల ప్రకారం... తెలంగాణలోని వరంగల్ నగరానికి చెందిన శివ, సత్యప్రకాష్, బెంగుళూరుకు చెందిన చంద్ర, అనంతపురం నగరానికి చెందిన దస్తగిరి, మరో ఇద్దరు కలిసి సులభంగా డబ్బు సంపాదించాలనుకున్నారు. గుప్త నిధులను వెలికితీయాలని నిర్ణయించుకున్నారు. డీ. చెక్కవారిపల్లి దగ్గర ఉన్న పట్టిగుట్టలో గుప్త నిధులు ఉన్నాయని భావించి, వాటిని ఎలాగైనా బయటకు తీయాలనుకున్నారు. పట్టిగుట్ట చుట్టుపక్కల ప్రాంతాలను పరిశీలించడానికి వెళ్లారు. గుట్ట దగ్గర కొందరు అనుమానితులు ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి నలుగురు నిందితులను అరెస్టు చేశారు. పోలీసులను చూడగానే మరో ఇద్దరు వ్యక్తులు అక్కడి నుంచిపరారయ్యారు. నిందితుల నుంచి ఒక పీఎండీ డిక్టేటర్, కెపాసిటీ ఇండికేటర్, పీఎండీ లోకేటర్, యాంటెన్నా, బ్యాలెన్సింగ్ డివైజ్, డీప్ హంటర్ డివైస్, 3డీ స్కానర్, కారు, బైక్, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎన్నికలకు నోటిఫికేషన్
అనంతపురం టౌన్: విద్యుత్ ఉద్యోగుల కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ జారీ అయింది. ఈ మేరకు సొసైటీ అధ్యక్షుడు బషీర్ అహమ్మద్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 22న నామినేషన్ల స్వీకరణ, 23న పరిశీలన, 24న విత్‌డ్రాలు, 30న పోలింగ్ ప్రక్రియ ఉంటాయి. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 1,900 మందికి పైగా సభ్యులుగా ఉన్న విద్యుత్ ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

సేవల సారథి.. సంక్షేమ వారధి

ప్రతి నెలా 1వ తేదీ సూర్యుడి కంటే ముందే ఇంటి నుంచి బయలుదేరే వలంటీర్లు... లబ్ధిదారుల తలుపుతట్టి ‘వైఎస్సార్ పింఛన్ కానుక’ ఇచ్చి సంతోషాల వెలుగులు నింపుతున్నారు. ఏ ఆసరాలేని వారికి అన్నీ తామై వ్యవహరిస్తూ అండగా నిలుస్తున్నారు. తన పరిధిలోని 50 ఇళ్లకూ సేవకులుగా మారి ప్రజాభిమానాన్ని చూరగొన్నారు. పౌర సేవలన్నీ ప్రజల ముంగిళ్లలోనే అందిస్తూ గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యానికి బాసటగా నిలుస్తున్నారు. ప్రభుత్వం వారిని సగౌరవంగా చూస్తుండగా.. జనం సొంతం చేసుకున్నారు.



మడకశిర అరేపేటలో ప్రజల ఇంటి వద్దకే సరుకులను మోసుకెళ్తున్న వలంటీర్లు(ఫైల్)

ప్రాణాలు లెక్కచేయకుండా సేవలు
మడకశిరలోని అరేపేటలో 2021 ఏప్రిల్‌లో కరోనా పాజిటివ్ కేసు నమోదైంది. దీంతో అధికారులు 28 రోజుల పాటు కంటైన్మెంట్ జోన్‌గా ప్రకటించారు. ఎవరు ఇంటినుంచి బయటికి రాకుండా కఠిన ఆంక్షలు విధించారు. ఆ సమయంలో నిత్యావసరాలతో పాటు తమకు ఏమి కావాలన్నా ఫోన్ ద్వారా సమాచారం ఇస్తే చాలు... వలంటీర్లు క్షణాల్లో ఇంటి వద్దకే తీసుకొచ్చి ఇచ్చారు. ప్రాణాలకు తెగించి కంటైన్మెంట్ జోన్లలో సేవలందించారు. గ్యాస్ సిలిండర్లు మొదలు సరుకులను సైతం తీసుకువెళ్లి ప్రజలకు అందించారు. అందుకే ఆ వలంటీర్లను జనం తమ ఇంటి మనుషులుగా చూస్తారు. వలంటీర్లు కూడా తమ పరిధిలోని వారికి ఏ కష్టమొచ్చినా తోడుగా నిలుస్తున్నారు.



ఇతని పేరు సందుమియా. కదిరి సమీపంలోని పట్నం గ్రామం. భార్య 15 ఏళ్ల క్రితమే చనిపోయింది. పిల్లలు లేరు. చిన్న గదిలో నివాసం ఉంటున్నాడు. కోవిడ్ సమయంలో లాక్‌డౌన్‌తో చాలా ఇబ్బందులు పడ్డాడు. కనీసం తిండిలేక అల్లాడిపోయాడు. సందుమియా గురించి తెలుసుకున్న గ్రామ వలంటీర్ నాగేంద్ర నేరుగా సందుమియా వద్దకు వెళ్లాడు. బాగోగులు ఆరా తీసి నిత్యావసరాలు అందించాడు. ప్రాణభయంతో జనమంతా ఇళ్లకే పరిమితమైన సమయంలోనూ వలంటీర్ నాగేంద్ర తనను వెతుక్కుంటూ వచ్చి నిత్యావసరాలు అందజేయడంతో సందుమియా కన్నీళ్లతో నాగేంద్రకు కృతజ్ఞతలు తెలిపారు.

- సేవా వారధులుగా మారిన వలంటీర్లు
- పౌర సేవల్లో ప్రభుత్వానికి సహకారం
- ప్రజలకు అడుగడుగునా తోడు
- సేవలను కొనియాడుతున్న జనం

సాక్షి నెట్‌వర్క్, శ్రీసత్యసాయి జిల్లా: ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు నేరుగా అర్హుల ముంగిటకే అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చారు. 50 గృహాలకు ఒక వలంటీర్‌ను నియమించి.. ఆయా కుటుంబాలకు అవసరమైన సేవలను అందిస్తున్నారు. జిల్లాలో 8,490 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. వీరంతా కులం, మతం, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నారు. ఒకటో తేదీ తెల్లవారుజామునుంచే లబ్ధిదారులకు ఠంచన్‌గా పింఛన్ అందిస్తున్నారు. బియ్యం కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు లేని వారి నుంచి అవసరమైన పత్రాలు సేకరించి సచివాలయంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయించి మంజూరు చేయిస్తున్నారు. డీలర్ వద్ద పడిగాపులు కాయకుండా ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందుకునే విధంగా సమాచారం అందిస్తూ తోడ్పాటునందిస్తున్నారు. వ్యాక్సినేషన్, ఆరోగ్య పరీక్షల సమాచారం చేరవేసి ప్రజారోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్నారు. తాగునీరు, కాలువల్లో పూడిక, వీధిలైట్ల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి మౌలిక సదుపాయాలు కల్పించడంలోనూ కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేసే నవరత్నాల పథకాలు, చేపట్టే కార్యక్రమాల గురించి తమ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి వలంటీర్లు వివరిస్తున్నారు. అంతేకాదు కరోనా, వరదలు వంటి విపత్తుల వేళ ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించి ప్రశంసలూ అందుకున్నారు. అలాంటి వారిని నీచ రాజకీయాల్లోకి లాగడం.. ప్రజా సేవకులపై పవన్‌కళ్యాణ్ నోరుపారుసుకోవడాన్ని జనం తప్పుపడుతున్నారు.



దివ్యాంగుడికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ (ఫైల్)

నేడు పుట్టపర్తిలో ర్యాలీ

జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం పుట్టపర్తిలో వలంటీర్లు భారీ ర్యాలీ నిర్వహించడానికి సిద్ధమయ్యారు. ర్యాలీలో స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు పాల్గొననున్నారు.

వెతుక్కుంటూ వెళ్లి కానుక అందజేత
పుట్టపర్తికి చెందిన వెంకటరాముడు జబ్బుతో బాధపడుతూ అనంతపురంలోని ఓ ఆస్పత్రిలో మూడు నెలలుగా చికిత్స పొందుతున్నారు. ఆయన భార్య సైతం ఆయనకు తోడుగా ఉంటోంది. పైగా డబ్బు అవసరం బాగా ఉంది. వీరి గురించి తెలుసుకున్న వలంటీర్ గౌతమి సొంత ఖర్చుతో అనంతపురానికి వెళ్లి మూడు నెలల పాటు ‘వైఎస్సార్ పింఛన్ కానుక’ అందజేసింది. తమను వెతుక్కుంటూ వచ్చి మరీ పింఛన్ అందజేసిన గౌతమికి వెంకటరాముడు దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. ఆమె అందించిన పింఛన్ డబ్బులతోనే వైద్య ఖర్చులు పెట్టుకొని ఇటీవలే ఇంటికి వచ్చారు.



జిల్లాలో..

వార్డు సచివాలయాలు	131
గృహాలు	1,34,982
జనాభా	4,28,079
వార్డు వలంటీర్లు	2,252
గ్రామ సచివాలయాలు	413
గృహాలు	4,78,190
జనాభా	14,26,845
గ్రామ వలంటీర్లు	7,605

దగ్గరుండి సేవలు చేశారు



నాకు కరోనా సోకినప్పుడు మా గ్రామ వలంటీరు మేకల శివప్రసాద్ దగ్గరుండి సేవలు అందించాడు. మా బంధువులు కూడా నా దగ్గరకు వచ్చేందుకు సాహసించలేదు. కానీ వలంటీర్ నాకు ధైర్యం చెప్పారు. ఏమీ కాదంటూ నాలో ఆత్మవిశ్వాసం నింపాడు. నన్ను ఆస్పత్రిలో చేర్పడంతో పాటు తిరిగి నేను సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి వచ్చేదాకా తోడుగా నిలిచాడు. అంతేకాక రోజూ మాత్రలు వేసుకుంటున్నావా అంటూ వాకబు చేసేవాడు. వలంటీర్ సాయంతోనే కరోనా నుంచి బయట పడ్డా.

– యం.వెంకటరమణ, బయ్యారెడ్డి పల్లి

పవన్ అత్యంత ప్రమాదకర వ్యక్తి
- ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ అత్యంత ప్రమాదకర వ్యక్తి అని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. సచివాలయ వ్యవస్థ ప్రవేశ పెట్టిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నారని, అందుకు తగ్గట్టుగానే గ్రామ/వార్డు వలంటీర్లు ఇంటింటికీ తిరిగి సేవలందిస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. కరోనా కష్టకాలంలోనూ వలంటీర్లు ప్రాణాలు తెగించి పనిచేశారన్నారు. అలాంటి వారి సేవలను ఓ పార్టీ అధినేతగా కొనియాడాల్సిన పవన్‌కళ్యాణ్...స్వార్థ రాజకీయంలో భాగంగా విమర్శించడం నిజంగా సిగ్గుచేటన్నారు. పవన్‌కళ్యాణ్ తక్షణమే వలంటీర్లకు క్షమాపణలు చెప్పాలని, ఆయనపై కేసు నమోదు చేయాలని శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వంపైనా, సీఎంపైనా అసత్య ఆరోపణలు చేస్తున్నవారిపై సుమోటోగా కేసులు నమోదు చేయాలన్నారు.

దిష్టిబొమ్మ దహనం

వలంటీర్లపై పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం కొత్తచెరువు మండలం కేశాపురం గ్రామంలో వలంటీర్లు, గ్రామస్తులు పవన్ దిష్టిబొమ్మ దహనం చేశారు. అంతకుముందు పవన్ దిష్టిబొమ్మకు గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

మద్యం విక్రేత జిల్లా బహిష్కరణ
- సంఘ విద్రోహ శక్తులను ఉపేక్షించబోమని ఎస్పీ వెల్లడి



సిద్దారెడ్డి

పుట్టపర్తి టౌన్: మద్యాన్ని అక్రమంగా నిల్వ చేసి విక్రయిస్తూ పదేపదే పోలీసులకు పట్టుబడినా పద్ధతి మార్చుకోని ఓ వ్యక్తిపై జిల్లా పోలీసులు ఆరు నెలల జిల్లా బహిష్కరణ వేటు వేశారు. వివరాల్లోకి వెళితే...హిందూపురం మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన ఏ.సిద్దారెడ్డి మద్యాన్ని అక్రమంగా నిల్వ చేయడం, విక్రయాలు చేస్తూ పలుమార్లు పోలీసులకు పట్టుపడ్డాడు. అయినా పద్ధతి మార్చుకోకుండా అక్రమ మద్యం విక్రయాలే జీవనాధారంగా మార్చుకుని ప్రజాజీవితానికి ఇబ్బంది కలిగించాడు. ఈ క్రమంలో ఆరు నెలల్లోనే సిద్దారెడ్డిపై సెబ్ పోలీసులు 3 ఎన్‌డీపీఎల్ కేసులు నమోదు చేశారు. దీంతో అతనిపై నమోదైన కేసుల తీవ్రత దృష్ట్యా జిల్లా బహిష్కరణ చేయాలని ఎస్పీ మాధవరెడ్డి భావించారు. ఈ మేరకు కలెక్టర్ అరుణ్‌బాబుకు ప్రతిపాదన పంపగా, స్పందించిన కలెక్టర్ సిద్దారెడ్డిని 6 నెలల పాటు జిల్లా బహిష్కరణ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు 11వ తేదీ నుంచే అమల్లోకి వచ్చినట్లు ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. సంఘ విద్రోహ శక్తులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. జిల్లా పరిధిలో ప్రజల ఆరోగ్యానికి, సమాజంలో శాంతి భద్రతలకు హాని కలిగించే ఏ ఒక్కరినీ ఉపేక్షించబోమని ఎస్పీ మాధవరెడ్డి హెచ్చరించారు.

కట్టుకథ..పిచ్చి రాత

ఈనాడు కథనం ఇలా..
ధర్మవరం చేనేత వ్యాపారులపై వైకాపా నాయకుడి దాష్టీకం... ఆలయ సిల్క్స్ యజమాని అవినాష్ గుప్తా వైఎస్సార్ సీపీ నేత. అందువల్లే కేసు నమోదుకు పోలీసుల మీనమేషాలు. నిందితున్ని కేసు నుంచి తప్పించేందుకే ఇలా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు.

వాస్తవం ఇలా..
చేనేతలపై దాడి దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో కనిపించగానే ప్రభుత్వం సీరియస్‌గా స్పందించింది. కేసును స్పెషల్ టాస్క్‌ఫోర్సుకు అప్పగించగా పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. మరోవైపు ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి బాధిత వ్యాపారులను పరామర్శించారు. వారిచేత అదేరోజు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయించారు. పోలీసులు నిందితుడిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. దీంతో బాధిత వ్యాపారులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యే కేతిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

చేనేత వ్యాపారులపై దాడి ఘటనలో ఈనాడు విషపు రాతలు
- దాడి ఘటనను వైఎస్సార్‌సీపీకి ఆపాదించేందుకు అష్టకష్టాలు
- పార్టీలకు సంబంధం లేదని తేల్చిచెప్పిన బాధితులు
- దాడి దృశ్యాలు వైరల్ కాగానే నిందితున్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఘటనను సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం
- వ్యాపారులతో ఫిర్యాదు ఇప్పించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి
- నిందితుడిపై నాన్‌బెయిలబుల్ కేసులు.. రిమాండ్‌కు తరలింపు

ధర్మవరం: రాష్ట్రంలో ఏ సంఘటన జరిగినా, ఏ అకృత్యం జరిగినా దాన్ని వైఎస్సార్ సీపీకి అంటగట్టేందుకు టీడీపీ నేతల డైరెక్షన్‌లో ఈనాడు విషపురాతలు రాస్తోంది. 20 రోజుల క్రితం విజయవాడ నగరంలోని ‘ఆలయ సిల్క్స్’ షోరూం యజమాని అవినాష్‌గుప్తా ధర్మవరానికి చెందిన చేనేత వ్యాపారులు గిర్రాజు శశి, కోటం ఆనంద్‌పై చేసిన దాడిని అధికార పార్టీ ఖాతాలో వేసేందుకు ప్రయత్నించింది.



బాధిత చేనేత వ్యాపారులకు ధైర్యం చెబుతూ మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి (ఫైల్)

ఆరోజు ఏం జరిగిందంటే..

ధర్మవరం వ్యాపారులు గిర్రాజు శశి, కోటం ఆనంద్ విజయవాడలోని ఆలయ సిల్క్స్ షోరూంకు పట్టు చీరలు సరఫరా చేస్తుంటారు. ఈ క్రమంలో సదరు షోరూం యజమాని అవినాష్ గుప్తా వీరికి రూ.2.33 లక్షలు బకాయి పడ్డాడు. నెలలు గడుస్తున్నా ఇవ్వకపోవడంతో జూన్ 2వ తేదీన వ్యాపారులిద్దరూ విజయవాడకు వెళ్లి డబ్బులు ఇవ్వాలని అవినాష్‌గుప్తాను గట్టిగా అడిగారు. దీంతో అవినాష్‌గుప్తా, అకౌంటెంట్ నాగేశ్వర్‌రావుతో కలసి వ్యాపారులను చితకబాదారు. ఆ దృశ్యాలను వీడియో తీయించాడు. విషయం బయటకు చెబితే వీడియోలు బహిర్గతం చేస్తానని బెదిరించి పంపించాడు. వీడియోలు బయటకు వస్తే పరువు పోతుందని భావించిన వ్యాపారులు మౌనంగా ఉండిపోయారు. అయితే 20 రోజుల తర్వాత సదరు షోరూం యజమానే వీడియోలను బహిర్గతం చేశాడు.

సీరియస్‌గా స్పందించిన ప్రభుత్వం

ధర్మవరం వ్యాపారులపై దాడి ఘటన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కాగానే ప్రభుత్వం సీరియస్‌గా స్పందించింది. ఈనెల 7వ తేదీనే ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి బాధిత చేనేత వ్యాపారులను పరామర్శించి ఫ్యాక్స్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేయించారు. అదేరోజు నిందితుడు అవినాష్‌గుప్తా, అకౌంటెంట్ నాగేశ్వర్‌రావు, నాగులపై ఐపీసీ సెక్షన్ 342, 392, 394, 506, 324 రెడ్‌విత్ 34ల కింద నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేశారు. జడ్జి రిమాండ్ ఆదేశించగా.. రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు.

నిస్సిగ్గు రాతలు

దాడి చేసిన వ్యక్తి వైఎస్సార్ సీపీ నేత అని తన కథనంలో రాసిన ఈనాడు పత్రిక అతను ఆ పార్టీలో ఏ హోదాలో ఉన్నాడో రాయలేదు. ఎందుకంటే అతనికీ వైఎస్సార్ సీపీకి ఎలాంటి సంబంధమూ లేదు. కేవలం వైఎస్సార్‌సీపీపై బురదజల్లడమే పనిగా పెట్టుకుని సదరు షోరూం యజమాని వైఎస్సార్‌సీపీ నాయకుడు అంటూ కట్టుకథ అల్లింది. దీనిపై బాధిత చేనేత వ్యాపారులు విస్మయం వ్యక్తం చేశారు. తమకు అండగా నిలిచి నిందితునిపై చర్యలు తీసుకోవడంలో చొరవ చూపిన ప్రభుత్వం, వైఎస్సార్‌సీపీపై ఇటువంటి రాతలు రాయడం బాధ కల్గించిందని వారు మీడియా ముఖంగా చెప్పడం గమనార్హం.

ప్రభుత్వం అండగా నిలిచింది



అవినాష్‌గుప్తా మమ్మల్ని కొట్టి బాధించిన ఘటన వీడియోలు వైరల్ అవ్వడంతో మేము ఎంతో కలత చెందాం. ఈ ఘటనలో ఎలాంటి రాజకీయ ప్రమేయం లేదు. జరిగిన అన్యాయాన్ని తెలుసుకుని ఎమ్మెల్యే కేతిరెడ్డి మమ్మల్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయనే మాతో పోలీసులకు ఫిర్యాదు చేయించారు. ప్రభుత్వం మాకు అండగా నిలిచి నిందితుడిని అరెస్టు చేసింది.

–గిర్రాజు శశి, పట్టు చీరల వ్యాపారి, ధర్మవరం

కఠినంగా శిక్షించాలి



విజయవాడలో మాపై దాడి గురించి బయట చెప్పేందుకు భయపడ్డాం. అయితే ప్రభుత్వ మద్దతు, ఎమ్మెల్యే కేతిరెడ్డి అండతో పోలీసులకు ఫిర్యాదు చేశాం. అదేరోజే ప్రభుత్వం స్పందించి నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు పంపింది. చట్ట పరిధిలో వారిని కఠినంగా శిక్షించాలి.

–కోటం ఆనంద్, పట్టుచీరల వ్యాపారి

సాయిమార్గం సకల హితం

ప్రశాంతి నిలయం: ప్రశాంతి నిలయంలో మంగళవారం సత్య సాయి గ్లోబల్ కౌన్సిల్ జోన్–9 దేశాలకు చెందిన చిన్నారులు ‘ఐ హియర్ యూ స్వామీ’ అన్న పేరుతో నిర్వహించిన నాటిక ఆకట్టుకుంది. సత్యసాయి బోధనలను ఆచరిస్తూ 6 దుర్గుణాల బారిన పడకుండా మానవతా విలువలకు కట్టుబడి పర్యావరణాన్ని రక్షించుకోవాలనే సందేశంతో నాటిక సాగింది. చిన్నారులు చక్కటి ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. కార్యక్రమం అనంతరం చిన్నారులను సత్యసాయి సెంట్రల్ సభ్యులు అభినందించి జ్ఞాపికలు అందజేశారు.



ఐ హియర్ స్వామీ నాటకంలో పర్యావరణ హితానికి తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తున్న చిన్నారులు



సాయి బోధనల్లోని సత్యమార్గాన్ని వివరిస్తున్న చిన్నారులు

క్లుప్తంగా

పర్యాటక స్థలాల లీజుకు 15న వేలం

పుట్టపర్తి టౌన్: జిల్లాలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలోని స్థలాలు లీజుకు ఇస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగేశ్వర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిమ్మమ్మ మర్రిమాను, చిలమత్తూరు మండలం వీరాపురం వద్ద ఉన్న పర్యాటక నిర్మాణాలు, నసనకోట దుర్గమ్మ గుడి సమీపంలోని నిర్మాణాలు, లేపాక్షి ఆలయం వద్ద ఉన్న థీంపార్క్ లీజుకు పొందవచ్చన్నారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఈ నెల 15న 11 గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధరావత్తు చెల్లించి పాల్గొనాలన్నారు. లీజు పొందిన వారు వారంలోపు టూరిజమ్ కౌన్సిల్ పేరు మీద డీడీలు తీసి ఒప్పంద పత్రం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. వివరాలకు జిల్లా పర్యాటక శాఖ అధికారిని ఫోన్ నంబర్ 9121144085లో సంప్రదించాలని ఆయన సూచించారు.

మహిళ బలవన్మరణం

గుమ్మఘట్ట: జీవితంపై విరక్తితో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... గుమ్మఘట్ట మండలం భూపసముద్రం గ్రామానికి చెందిన పూసల అంజినమ్మ (45), శ్రీనివాసులు దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్నపాటి దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీనివాసులు నాలుగు నెలల క్రితం మృతి చెందాడు. ఈ క్రమంలో కుటుంబ పోషణ భారం కావడంతో జీవితంపై విరక్తి చెందిన అంజినమ్మ సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంటి వరండాలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను రాయదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

అన్నదాతా మేలుకో!

- ఈ నెలాఖరుతో ముగియనున్న ఈ-కేవైసీ గడువు
- రైతులు మేల్కోక పోతే ఏటా రూ.6 వేల నష్టం



కదిరి: రైతులకు పెట్టుబడి భారం తగ్గించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎం-కిసాన్ సమ్మాన్ నిధి, వైఎస్సార్ రైతు భరోసా పథకాలను ప్రవేశ పెట్టాయి. వీటి ద్వారా ప్రతి రైతుకూ ఏటా రూ13,500 ఆర్థిక సాయం అందుతోంది. ఇందులో కేంద్రం మూడు విడతలుగా రూ.6 వేలు అందజేస్తోంది. ఈ మొత్తం అందాలంటే ఈ-కేవైసీ తప్పనిసరిగా నమోదు చేయించాల్సి ఉంది. ఈ విషయంపై అవగాహన లేక ఎంతో మంది రైతులు నష్టపోతున్నారు. ఈ నెల 31వ తేదీలోపు ఈ-కేవైసీ చేయించుకోకపోతే పీఎం కిసాన్ సమ్మాన్ నిధితో పాటు వైఎస్సార్ రైతు భరోసా నగదు కూడా జమ కాదని అధికారులు హెచ్చరిస్తున్నారు. జిల్లాలో 2,92,170 మంది రైతులుండగా వీరిలో ఇప్పటి వరకూ 2,45,270 మంది ఈ-కేవైసీ చేయించారు. మరో 46,900 మంది ఈ-కేవైసీ చేసుకోవాల్సి ఉంది.

బుక్కపట్నం, ఎన్పీకుంట టాప్..

ఈ-కేవైసీ నమోదులో బుక్కపట్నం, ఎన్పీకుంట మండలాల రైతులు ముందంజలో ఉన్నారు. ఈ రెండు మండలాల్లో ఇప్పటికే 95 శాతం ఈ-కేవైసీ నమోదు ప్రక్రియ పూర్తయింది. తర్వాతి స్థానాల్లో 94 శాతంతో తాడిమర్రి, 92 శాతంతో సీకే పల్లి, 90 శాతంతో కొత్తచెరువు, పుట్టపర్తి మండలాలున్నాయి. 75 శాతంతో అమరాపురం మండలం పూర్తిగా వెనుకబడింది. ఈ కేవైసీ నమోదులో వెనుకబడిన వాటిలో అమడగూరు, తలుపుల, అగళి, సోమందేపల్లి మండలాలూ ఉన్నాయి. ఇప్పటి వరకూ రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన రైతు భరోసా నగదును అందుకున్న రైతులు సైతం ఈ సారి ఈ-కేవైసీ చేయించుకోకపోతే పీఎం కిసాన్ సమ్మాన్ నిధి డబ్బు అందుకోలేరు. భవిష్యత్‌లో వీరికి రైతుభరోసా నగదు కూడా జమకాదని అధికారులు అంటున్నారు.

రైతులు ముందుకు రావడం లేదా?

ప్రధానంగా ఆదాయపు పన్ను చెల్లింపుదారులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఒకే ఇంట్లో ఎక్కువ మంది పెట్టుబడి సాయం అందుకుంటున్న వారు ఈ-కేవైసీ నమోదు చేయించుకునేందుకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ఈ-కేవైసీ పేరుతో ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేసి పీఎం కిసాన్ సమ్మాన్ నిధిని ఎగ్గొట్టాలని కేంద్ర ప్రభుత్వ ఆలోచనగా ఉందనే అపోహ చాలా మందిలో ఉంది. అలాగే రైతులు వాడుతున్న సెల్ ఫోన్‌కు ఆధార్ లింక్ లేకపోవడం కూడా మరో కారణంగా తెలుస్తోంది. గతంలో రైతు వాడుతున్న సెల్ నంబర్‌కు బదులు ఇప్పుడు మరో నెంబర్ ఉపయోగిస్తున్నందున ఓటీపీ గతంలో వాడుతున్న నెంబర్‌కు వెళ్లడం, మరికొంత మంది రైతులకు అసలు సెల్‌ఫోనే లేకపోవడం తదితర కారణాలతో ఈ-కేవైసీ నమోదు ప్రక్రియలో జాప్యం చోటు చేసుకుంటున్నట్లు సమాచారం.

జిల్లాలో ఈ కేవైసీ నమోదు వివరాలు ఇలా..	
మొత్తం మండలాలు	32
రైతులు	2,92,170
ఈ-కేవైసీ చేయించిన వారు	2,45,270
ఈ-కేవైసీ చేసుకోని వారు	46,900
పెండింగ్ శాతం	16

కేంద్రం పునరాలోచించాలి



రైతులకిచ్చే రూ.2వేలకు ఇన్ని నిబంధనలు పెట్టడం సరికాదు. రైతులను పీఎం కిసాన్ సమ్మాన్ నిధికి దూరం చేయాలనే దురుద్దేశంతోనే ఈ-కేవైసీ అంశాన్ని కేంద్రంలోని బీజేపీ సర్కార్ తెరపైకి తెచ్చింది. రైతులందరి వద్ద సెల్‌ఫోన్లు ఉండవు. దీంతో ఎలాంటి షరతులు లేకుండా పాసు పుస్తకం ఉన్న ప్రతి రైతుకూ పెట్టుబడి సాయం అందజేయాలి.

– సుబ్బిరెడ్డి, రైతు సంఘం నాయకుడు

రైతులు త్వరపడాలి



ఈ నెలాఖరుతో ఈ-కేవైసీ నమోదుకు గడువు ముగుస్తుంది. రైతులు త్వరపడాలి. సచివాలయాలు, మీ-సేవా కేంద్రాలు, సీఎస్సీ సెంటర్లలో ఈ-కేవైసీ చేసుకోవచ్చు. వలస వెళ్లిన రైతులు కొందరు అందుబాటులోకి రాలేదు. అలాంటి వారు వారి కుటుంబసభ్యులు, బంధువుల ద్వారా వారి ఆధార్ నంబర్, సెల్ నంబర్ చెప్పి, అనుసంధానం సమయంలో ఓటీపీ చెప్పినా సరిపోతుంది.

– వైవీ సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి

సచివాలయాల సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా షేక్ మహబూబ్‌బాషా



ధర్మవరం అర్బన్: ఏపీ గ్రామ, వార్డు సచివాలయాల సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ధర్మవరం పట్టణానికి చెందిన షేక్ మహబూబ్‌బాషా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. గుంటూరులో మంగళవారం అసోసియేషన్ నూతన కమిటీని ఎంపిక చేశారు. ధర్మవరం సచివాలయ ఉద్యోగి షేక్ మహబూబ్ బాషాను రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంపిక చేశారు. తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వార్డు, గ్రామ సచివాలయాల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

నవ వధువు ఆత్మహత్య

- భర్త పక్కన ఉండగానే అఘాయిత్యం



ఆత్మహత్య చేసుకున్న కృష్ణవేణి

పుట్టపర్తి అర్బన్: పెళ్లైన 28 రోజులకే ఓ నవ వధువు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పుట్టపర్తి మండలం వెంగళమ్మచెరువు ఎస్సీ కాలనీలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై దాదాపీర్, తహసీల్దార్ నవీన్‌కుమార్ వివరాల మేరకు.. గ్రామానికి చెందిన హరిజన ముత్యాలు, సన్నపాపకు నలుగురు కుమార్తెలు. చిన్న కుమార్తె కృష్ణవేణి (26) ఇటీవల బీ ఫార్మసీ పూర్తి చేసింది. మేనమామ కుమారుడైన రామగిరి మండలం కొత్తగ్యాదికుంట గ్రామానికి చెందిన చిన్నికృష్ణతో గత నెల 14న తల్లిదండ్రులు వివాహం చేశారు. బీఫార్మసీ చదువుతున్న సమయంలోనే వీరిద్దరూ ప్రేమించుకున్నారు. పెళ్లైన మూడు రోజులకే ఆషాఢ మాసం ప్రారంభం కావడంతో గత నెల 17న కృష్ణవేణి పుట్టింటికి వచ్చింది. నాలుగు రోజుల క్రితం భర్త చిన్నికృష్ణ సైతం వెంగళమ్మచెరువుకు వచ్చాడు. ఇద్దరూ గొడవ పడుతుండగా తల్లిదండ్రులు సర్దిచెప్పారు. రెండు గదులున్న ఇంట్లో సోమవారం రాత్రి కృష్ణవేణి తల్లిదండ్రులు ఒక గదిలో, నూతన దంపతులు మరో గదిలో పడుకున్నారు. రాత్రి సైతం ఇద్దరూ వాదులాడుకున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం తెల్లవారుజామున కృష్ణవేణి కొక్కేనికి చున్నీతో ఉరి పోసుకుందంటూ చిన్నికృష్ణ అత్తామామలకు సమాచారం ఇచ్చాడు. కిందికి దించి చూడగా అప్పటికే మృతి చెందడంతో బోరున విలపించారు. భర్తకు మరో మహిళతో అక్రమ సంబంధం ఉన్నట్లు తెలిసి కృష్ణవేణి తరచూ గొడవ పడుతుండేదని ఎస్సై తెలిపారు.

కేసు నమోదులో తాత్సారం

- 'సమగ్ర' సిమెంటు దొంగల వ్యవహారంలో పోలీసుల మీనమేషాలు



రాప్తాడురూరల్: ఒకటికాదు రెండు కాదు.. దాదాపు 70 లోడ్ల ప్రభుత్వ సబ్సిడీ సిమెంటు పక్కదారి పట్టింది. సమగ్ర శిక్ష కార్యాలయంలో జరిగిన ఈ దందాపై కలెక్టర్లు గౌతమి, అరుణ్‌బాబు స్పందించి వెంటనే క్రిమినల్ కేసు నమోదు చేయించాలని ఉత్తర్వులు జారీ చేశారు. మరో వైపు డిపార్ట్‌మెంటల్ విచారణకు ఆదేశించారు. స్వయంగా ఇద్దరు కలెక్టర్లు ఆదేశించి రెండువారాలవుతున్నా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు.

అసలేం జరిగిందంటే...

సమగ్ర శిక్ష కార్యాలయంలో ఈఈ, డీఈల పేర్లతో లాగిన్లు ప్రారంభించి శ్రీసత్యసాయి జిల్లాలోని నాబార్డు స్కూళ్లు, కేజీబీవీ జూనియర్ కళాశాలల్లో నిర్మాణ పనుల పేరుతో యథేచ్ఛగా సిమెంట్‌ను బుక్ చేస్తూ వచ్చిన లోడ్లను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ సొమ్ము చేసుకున్నారు. 64 ఇండెంట్లతో సుమారు 2 వేల టన్నుల సిమెంట్ బుక్ చేశారు. ఇందులో 500 టన్నుల దాకా కాంట్రాక్టర్లకు చేరినా...తక్కిన 1500 టన్నుల సిమెంటు పక్కదారి పట్టింది. ఈ వ్యవహారం డిపార్ట్‌మెంట్ అధికారుల దృష్టికి వచ్చినా బయటకు పొక్కకుండా జాగ్రత్త పడ్డారు. సిమెంట్ దొంగల నిర్వాకాన్ని 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. వరుస ప్రత్యేక కథనాలు ఉమ్మడి జిల్లాలో ప్రకంపనలు సృష్టించాయి. రెండు జిల్లాల కలెక్టర్లు స్పందించి విచారణకు ఆదేశించారు. ప్రాథమిక నిర్ధారణకు వచ్చిన కలెక్టర్ కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్‌ను విధుల నుంచి తప్పించారు. అయితే ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు మాత్రం సంబంధిత అధికారులు నేటికీ ఇవ్వలేదు. మరోవైపు శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ డిపార్ట్‌మెంటల్ విచారణకు ఆదేశించినా...అదికూడా ఇప్పటిదాకా ఒక్క అడుగూ ముందుకు సాగలేదు. పరిణామాలు పరిశీలిస్తుంటే..దీని వెనుక ఎవరో బలమైన వారి హస్తం ఉందనే అనుమానాలు వ్యక్తమతున్నాయి.

కుటుంబ నియంత్రణ ఆవశ్యకత గుర్తించాలి

- డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్రశాంతి నిలయం: ప్రతి ఒక్కరూ కుటుంబ నియంత్రణ ఆవశ్యకతను గుర్తించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్‌వీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలో నిర్వహించిన ర్యాలీని డీఎంహెచ్‌ఓ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక జనాభాతో అనర్థాలు కలుగుతాయన్నారు. ఈ విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏటా జులై 11న ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహిస్తున్నారన్నారు. కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన పెంచుకుని పాటించాలని సూచించారు. ఈ నెల 24 వరకూ రెండో దశ జనాభా స్థిరీకరణ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ తిప్పేంద్రనాయక్, డీపీఎంఓ డాక్టర్ కుళ్లాయినాయక్, డెమో బాబా ఫక్రుద్దీన్, వైద్యులు డాక్టర్ నాగరాజునాయక్, డాక్టర్ ఫణీంద్ర, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సైబర్ అధికారులమంటూ బురిడీ

ముదిగుబ్బ: సైబర్ అధికారులమంటూ ఓ యువతికి అగంతకులు బురిడీ కొట్టించారు. రూ. 5.93 లక్షలు స్వాహా చేశారు. మండల పోలీసులు తెలిపిన మేరకు.. ముదిగుబ్బ మండల కేంద్రానికి చెందిన ఓ యువతికి మంగళవారం ఉదయం ఫోన్ కాల్ వచ్చింది. సైబర్ క్రైం అధికారులమంటూ అవతలి వ్యక్తులు మాట్లాడారు. మీపై సైబర్ నేరాలు ఉన్నాయని బెదిరించారు. తమ సైబర్ క్రైం ఖాతాకు నగదు బదిలీ చేయాలని, లేకుంటే అరెస్ట్ చేస్తామని భయపెట్టారు. దీంతో ఆ యువతి వారు చెప్పిన ఖాతాకు రూ.5 లక్షలు బదిలీ చేసింది. మరికొద్ది సేపటికి మళ్లీ ఫోన్ చేసిన దుండగులు ఇంకా ఖాతాలో డబ్బులు ఉన్నాయి, వాటినీ పంపాలని కోరారు. దీంతో యువతి రెండో సారి రూ.93 వేలను వారు చెప్పిన ఖాతాకు బదిలీ చేసింది. విషయాన్ని కుటుంబసభ్యులకు తెలపగా, వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పలు రైళ్లు పాక్షికంగా రద్దు

గుంతకల్లు: తిరుపతి రైల్వే జంక్షన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల దృష్ట్యా పలు రైళ్లను పాక్షికంగా రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ రాకేష్ తెలిపారు. కదిరిదేవరపల్లి - తిరుపతి (07590) స్పెషల్ ప్యాసింజర్ రైలును ఆగస్టు 10 వరకు, తిరుపతి-గుంతకల్లు (07656) స్పెషల్ ప్యాసింజర్ రైలును ఆగస్టు 11 వరకు పాకాల - తిరుపతి మధ్య రద్దు చేశారు. తిరుపతి-హుబ్లీ (07657/58) స్పెషల్ ప్యాసింజర్ రైళ్లను ఆగస్టు 10 వరకు రేణిగుంట-తిరుపతి మధ్య రద్దు చేసినట్లు వివరించారు. తిరుపతి జంక్షన్ మీదుగా ప్రయాణించే కొన్ని రైళ్లను దారి మళ్లించినట్లు పేర్కొన్నారు.

మాతా శిశు మరణాలు నివారించాలి

ప్రశాంతి నిలయం: మాతా శిశు మరణాలు నివారించాలని డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా వైద్య సిబ్బంది పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ తిప్పేంద్రనాయక్, పీడియాట్రీషియన్ డాక్టర్ నజీర్, గైనకాలజిస్ట్ పద్మలత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు

- కేసు మూసేసిన లోకాయుక్త



జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): కొత్తచెరువు మండలంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ, అసైన్డ్ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకున్నట్లు నివేదిక అందడంతో కేసును మూసివేస్తూ లోకాయుక్త చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి తీర్పు వెలువరించారు. వివరాలు.. కొత్తచెరువు మండలంలోని కొత్తచెరువు, తలమర్ల, కొత్తపల్లి గ్రామాల పరిధిలోని రూ.3 కోట్ల విలువ చేసే ప్రభుత్వ, అసైన్డ్ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని, అక్రమార్కులకు రెవెన్యూ అధికారులు సహకరించి వెబ్‌ల్యాండ్‌లో మార్పులు చేస్తున్నారని కొత్తచెరువుకు చెందిన ఎన్.రవిచంద్రతో పాటు కొందరు గ్రామస్తులు 2021లో లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. దీంతో చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి అప్పట్లో లోతైన విచారణ చేపట్టాలని అనంతపురం జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చారు. ఈ క్రమంలో విచారణకు దిగిన ఆర్‌డీఓ అప్పటి కొత్తచెరువు తహసీల్దార్ కె.రామచంద్రప్ప అక్రమార్కులతో చేతులు కలిపి ప్రభుత్వ, అసైన్డ్ భూములను వారి పేరిట వెబ్‌ల్యాండ్‌లో మార్పు చేసినట్లు గుర్తించారు. దీంతో ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేయించారు. అంతే కాక కొత్త చెరువు వీఆర్వో టి.రవిశంకర్, తలమర్ల వీఆర్వో టి.చెన్నయ్య, కొత్తపల్లి వీఆర్వో హిజ్బుర్ రహిమాన్ ఆక్రమణల్లో పాలుపంచుకున్నట్లు గుర్తించారు. వీరిపై కూడా శాఖాపరమైన చర్యలకు ఆదేశాలు జారీ అయ్యాయి. చివరకు అక్రమార్కుల పేరిట నమోదైన పట్టాదారు పాసుపుస్తకాలను రద్దు చేసి ఆ భూములను కూడా వెనక్కి తీసుకొని పరిరక్షించినట్లు మంగళవారం లోకాయుక్తకు సమర్పించిన నివేదికలో పేర్కొనడంతో కేసు మూసి వేస్తున్నట్లు చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి తీర్పు చెప్పారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన రెవెన్యూ అధికారులే అక్రమార్కులకు వంత పాడటం దారుణమని లోకాయుక్త చైర్మన్ వ్యాఖ్యానించారు. ఇలాంటి సంఘటనలు ఎక్కడైనా ఉంటే లోకాయుక్తలో ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

జగనన్నతోనే మైనారిటీల సంక్షేమం



కరపత్రాల ద్వారా ముస్లింలకు అవగాహన కల్పిస్తున్న వక్ఫ్ బోర్డు జిల్లా అధ్యక్షుడు మొఘల్ నూరుల్లా

ఎన్పీకుంట: సీఎం జగనన్నతోనే మైనారిటీల సంక్షేమం సాధ్యమని జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ మొఘల్‌నూరుల్లా అన్నారు. 'హర్‌దిల్ మే వైఎస్సార్.. హమ్ సబ్ జగన్‌కే సాత్' కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు మసీదులను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పథకాల కింద 34,17,199 మంది బ్యాంకు ఖాతాల్లో సుమారు రూ.12 వేల కోట్లు ప్రభుత్వం జమ చేసిందని వివరించారు. ఉప ముఖ్యమంత్రి పదవితో పాటు శాసన మండలి డిప్యూటీ చైర్మన్ పదవిని సైతం ముస్లింలకు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని కొనియాడారు. హజ్ యాత్రకు విజయవాడ నుంచి విమాన సర్వీసును ప్రారంభించడానికి ఒక్కో హాజీకి రూ.80 వేలు అదనంగా చెల్లించాల్సి వచ్చినా, ఎక్కడా ఆలోచించకుండా 1,800 మందికి పైగా యాత్రికులకు రూ.1,500 కోట్లు జమ చేశారని తెలిపారు. జగనన్నకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఆయా మసీదుల ఇమామ్‌లు, మౌజన్లు తదితరులున్నారు.